ప్రజాశక్తి
బుధవారం 20 ఆగస్టు 2025 5 అనంతపురం

యూరియా పక్కదారి..!

◆ కర్నాటకకు తరలింపు ◆ రైతులకు అందక ఇబ్బందులు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

వర్షాలు రావడంతో పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ సమయంలో యూరియా కొరత రైతులను వేధిస్తోంది. అమ్మకం కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. వ్యవసాయ శాఖ అంచనాల కంటే అధికంగా కేటాయింపులు జరిగినట్టు రికార్డులు చెబుతున్నాయి. అయితే రైతులకు మాత్రం పూర్తి స్థాయిలో యూరియా అందుబాటులో లేదు. వర్షాలు ఆలస్యంగా వచ్చి పంటలు సాగు చేసుకుందామన్న రైతుకు యూరియా సమస్య వచ్చిపడింది.

పక్క రాష్ట్రం తరలుతోందా..?

పంటల సాగులో యూరియా కీలకమైనది. వరి, అరటి, మిరప , మొక్కజొన్న తదితర పంటలకు యూరియా ఎక్కువగా అవసరం అవుతుంది. యూరియా ఇప్పుడు పక్క రాష్ట్రం కర్నాటకకు తరలిపోతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీని మూలంగానూ సమస్య వస్తున్నట్లు తెలుస్తోంది. కర్నాటక రాష్ట్రంలో యూరియా ధర ఆంధ్రప్రదేశ్‌లో కంటే ఎక్కువగా ఉంది. ఇక్కడ బస్తా రూ.267 ఉండగా, కర్నాటకలో రూ.560 ఉంది. ఈ భారీ వ్యత్యాసం ఉండటంతో ఇక్కడి నుంచి బ్లాక్ మార్కెట్‌లో కర్నాటకు తరలిపోతున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ మేరకు అధికారుల తనిఖీల్లోనూ పట్టుబడటం గమనార్హం. రాయదుర్గంలో ఈ రకంగా అధికారుల తనిఖీల్లో పెద్దఎత్తున యూరియా అక్రమంగా తరలిస్తున్నది పట్టుబడినట్టు సమాచారం. ఇక గార్లదిన్నె మండలంలో ఒక కేంద్రంలో అధికారులు తనిఖీలు నిర్వహించగా స్టాకులో షార్టేజీ ఉన్నట్టు గుర్తించారు. ఇదంతా బ్లాక్ మార్కెట్‌లో పక్క రాష్ట్రంకు తరలిపోయినట్టు తెలుస్తోంది.

నియంత్రణకు అధికారులతో కమిటీ

యూరియా సమస్య తీవ్రమవుతుండటంతో జిల్లా ఉన్నతాధికారులు నియంత్రణకు ఇప్పుడు చర్యలు ఆరంభించారు. ప్రత్యేకంగా అధికారులతో తనిఖీకి బృందాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా నిర్వహణలో ఇబ్బందుల్లేకుండా చూసేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాకు వస్తున్న ఎరువులు, పంపిణీపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోనున్నారు.

కొరత లేకుండా చర్యలు

ఎరువుల కొరత లేకుండా రైతులకు సక్రమంగా అందించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నాం. ఈ వారంలో అదనంగా వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుంది. వచ్చిన యూరియా పక్కదోవ పట్టకుండా ఉండే విధంగా అధికారులతో కమిటీని నియమించాం. నిర్వహణలో ఎక్కడా సమస్యలేకుండా చేస్తాం.

ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారి.

"ఈ ఫొటోలో కన్పిస్తున్న మహిళ పేరు పుల్లమ్మ. ధర్మవరం మండలం ఓబుళనాయనపల్లి గ్రామం. మంచానికే పరిమితం అయిన ఈమె చాలా ఏళ్ల నుంచి వికలాంగ పింఛను తీసుకుంటోంది. ఇటీవల సర్వే పేరుతో ఈమెకు పింఛను రాదంటూ అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆమె తనకు పింఛన్ పునరుద్ధరించండి సార్.. అంటూ ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులను వేడుకుంది".

"రాప్తాడు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన హర్షిత పుట్టుకతోనే వికలాంగురాలు. చేతులు, కాళ్లు పనిచేయక మంచానికే పరిమితం అయ్యింది. మాటలు కూడా రావు. ఈమెకు 2015లో 100 శాతం వికలత్వం సర్టిఫికెట్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో కూడా రూ.15 వేల పింఛన్ అందింది. జనవరిలో నిర్వహించిన ప్రత్యేక సర్వేలో హర్షిత వందశాతం వికలత్వాన్ని 50 శాతానికి తగ్గించి అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో ఆమె పింఛన్‌ను రూ.6వేలకు తగ్గించారు".

భరోసాకు బ్రేక్..!

ఆర్థిక భరోసాగా ఉన్న పింఛన్లపై కూటమి ప్రభుత్వం కన్ను పడింది. పర్సంటేజీల పేరుతో వికలాంగుల పింఛన్లు తొలగిస్తూ వారికి షాక్‌ను ఇచ్చింది. ఇన్నాళ్లు అందుతున్న పింఛన్లకు బ్రేకులు వేస్తూ వికలాంగుల నడివిరిచింది. ఒక చేత్తో పింఛను సొమ్ము పెంచామని పెద్దగా చెప్పి మరో చేత్తో ఉన్న పింఛన్‌ను పూర్తిగా లాగేసుకుంది. పర్సంటేజీల పేరుతో పింఛన్‌ను తొలగిస్తూ నోటీసులు అందించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా నోటీసులు అందుకున్న వికలాంగులు సచివాలయాలు, ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అర్హులుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అక్కడి అధికారులు చావుకబురు చల్లగా చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వికలాంగుల కుటుంబాలను తీవ్ర కలవరపాటుకు గురి చేస్తోంది.

◆ వికలాంగులకు 'కూటమి' షాక్
◆ పరిశీలన పేరుతో పింఛన్ల తొలగింపు
◆ నోటీసులు రావడంతో కార్యాలయం వద్దకు పరుగులు
◆ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ అధికారుల ఉచిత సలహా

ప్రజాశక్తి - చిలమత్తూరు, అనంతపురం, ధర్మవరం రూరల్

ఇటీవల కూటమి ప్రభుత్వం వికలాంగత్వం ఎంత ఉందో వైద్యులతో ధవీకరించి పర్సంటేజీతో సర్టిఫికెట్‌ను తీసుకు రావాలని కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. గత 20 ఏళ్లుగా పింఛను తీసుకుంటున్న వికలాంగులు సైతం మళ్లీ సదరం సర్టిఫికెట్లు కోసం సచివాలయాలు, ఆస్పత్రు లకు పరుగులు పెట్టారు. రెండు, మూడు వారాలు ముందే సచివాలయంలోని సదరం లాగిన్‌లో తమ పేరు బుక్ చేసుకుని వైద్యుని వద్దకు వెళ్లి మరోసారి తాను ఎంత అంగ వైకల్యంతో ఉన్నానో నిర్ధారించి ధ్రువపత్రం ఇవ్వాలని కోరారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. ప్రభుత్వం చెప్పిన విధంగా కోతకు సిద్ధంగా ఉన్న వైద్యులు ప్రతి వికలాంగుడికీ వైకల్య శాతం తగ్గించి ధ్రువపత్రాలు ఇచ్చారు. ఇప్పుడు వైకల్యం శాతం 40 కంటే తగ్గిందన్న సాకుతో చాలా మంది పింఛన్లను తొలగిస్తున్నారు. దీంతో వికలాంగులు లబోదిబోమంటున్నారు. ఏం చేయాలో తెలియక మళ్లీ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

40 శాతం కంటే తక్కువ వికలత్వం ఉన్న వారికి సెప్టెంబర్‌లో పింఛన్లు ఇవ్వమని ఇప్పటికే సచివాలయాల ద్వారా సమాచారం ఇచ్చారు. పింఛన్ అందని వారి జాబితాను సైతం సచివాలయాల వద్ద అతికించారు. గత 20 ఏళ్లుగా ఇస్తున్న పింఛను ఇప్పుడు ఎందుకు ఇవ్వరని పలువురు వికలాంగులు అధికారులను ప్రశ్నిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. రూ.200 పింఛను ఇచ్చే సమయం నుంచి తీసుకున్న వికలాంగులు ఇప్పుడు అనర్హులుగా జాబితాలో పేర్లు రావడంతో లబోదిబోమంటున్నారు. అప్పుడున్న వికలత్వం ఇప్పుడెలా తగ్గుతుందంటూ ప్రశ్నిస్తున్నారు.

పింఛన్ల తొలగింపు దుర్మార్గం

అర్హులైన వికలాంగుల పింఛన్లను సర్వే పేరుతో తొలగించడం అన్యాయం. ఏళ్ల తరబడి వికలాంగుల పింఛన్ తీసుకున్న వారు ఇప్పుడెలా అనర్హులవుతారు. ప్రభుత్వం పింఛన్లలో కోత విధించేందుకు అనవసర నిబంధనలను తీసుకుని వచ్చింది. అనర్హుల ఏరివేత పేరుతో అర్హులకు అన్యాయం చేస్తున్నారు. అధికారులు కూడా కార్యాలయాల్లో ఉంటూ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండా పింఛన్ల తొలగింపు నిర్ణయాలు చేయడం సరికాదు. వికలాంగుల పింఛన్లు పనరుద్ధరణ కోసం బాధితుల పక్షాన సిపిఎం పోరాటం చేస్తుంది.

ఎం.బాలరంగయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు.

ఇప్పుడెలా అనర్హుడిని అయ్యాను..

నిరుపేద కుటుంబానికి చెందిన నేను 2011 సంవత్సరం నుంచి వికలాంగుల పింఛన్ తీసుకుంటున్నాను. అప్పుడు అర్హత ఉండే నాకు ఇప్పుడు అనర్హుడునెలా అయ్యాను. నా కాలు సరిగా లేకపోవడం వల్ల నేను ఏ పనీ చేయలేను. అటువంటి నాకు ఇప్పుడు అధికారుల నుంచి నోటీసు అందింది. నాకు పింఛన్ ఇప్పుడు నిలిపేశారు. నడవలేని నేను ఆఫీసుల చుట్టూ తిరగలేను. అధికారులు స్పందించి నా పింఛన్‌ను పునరుద్ధరించాలి.

వి.వెంకటేష్, మధురేపల్లి గ్రామం, చిలమత్తూరు మండలం.

ఉన్నఫలంగా పింఛన్ తొలగించారు

2012లో నాకు పింఛన్ మంజూరు అయ్యింది. అప్పుడు రూ.200 ఇచ్చే వాళ్లు. గత నెల వరకూ పింఛన్ వచ్చింది. ఇప్పుడు వైకల్యం 40 శాతం కంటే తక్కువ ఉందంటూ పింఛన్ తొలగించామని సచివాలయ అధికారులు చెబుతున్నారు. నాకు ప్రభుత్వం 89 శాతం వైకల్యం ఉన్నట్టు సర్టిఫికెట్ ఇచ్చారు. ఇప్పుడు 40 శాతం కంటే తక్కువ ఉందంటున్నారు. కనీసం నడవలేని స్థితిలో ఉన్న తనపై ప్రభుత్వం దయా చూపించాలి.

కళావతి, కల్లుకుంట, చిలమత్తూరు మండలం.

తొలగింపు నోటీసులతో ధర్మవరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద వికలాంగుల నిరసన

నేడు రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జెఎన్‌టియు భవన సముదాయంలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను వర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభిస్తారని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 10-30 గంటలకు అమరావతి నుంచి ముఖ్యమంత్రి దీనిని వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. జెఎన్‌టియు నుంచి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయా పరిశ్రమల యాజమాన్యాలు పాల్గొంటాయన్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. సెంటర్ వద్ద నాటిన మొక్కలను సంరక్షించాలని హార్టికల్చర్ డిడికి సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఆర్డీవో కేశవనాయుడు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులపై నవంబర్‌లో తనిఖీలు

◆ ఫిర్యాదులొస్తే డిస్మిస్‌కు సిఫార్సు చేస్తా ◆ డిఎంఎ సంపత్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిఎంఎ సంపత్‌కుమార్

నవంబర్‌లో రాష్ట్రమంతా ఆస్తి పన్నుల విధింపులపై థర్డ్ పార్టీ తనిఖీలు ఉంటాయని, ఈ సమయంలో ఏవైనా లోటుపాట్లపై ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిపై డిస్మిస్ చేసేందుకు సిఫార్సు చేస్తామని డిఎంఎ సంపత్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక కౌన్సిల్ హాల్‌లో జిల్లాలోని 12 మున్సిపాల్టీలు కార్పొరేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బద్వేలు, జమ్మలమడుగులో గృహాల పన్ను విధింపులపై ఇతర మున్సిపాలిటీల నుంచి రెవెన్యూ సిబ్బందిని పంపి సర్వే నిర్వహించామన్నారు. ఈ సర్వేలో 30 నుంచి 40 శాతం దాకా గృహ కొలతల కన్నా బాగా తగ్గించి తక్కువ పన్ను విధించిన విషయం వెలుగు చూసిందన్నారు. మున్సిపాల్టీ ఆదాయానికి గండికొట్టే ఇలాంటి పద్ధతి మంచిది కాదన్నారు. థర్డ్‌పార్టీ తనిఖీల్లో ఇలాంటివి బయటపడితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. కమిషనర్లు ఎవరి ఒత్తిళ్లకూ లోనుకావొద్దన్నారు. నీటి సరఫరాకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. త్వరలో పట్టణాల్లో ఎక్కువ ప్రకాశవంతంగా ఉండే నూతన వీధిదీపాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. అగ్రిమెంట్ కాబోతున్న కంపెనీ ఇచ్చే బల్బులు ఎక్కువ కాంతివంతంగా ఉండి వీధులలో ఎక్కువ ప్రకాశవంతంగా వీధిలైట్లు వెలుగునిస్తాయన్నారు. మురుగు కాలువల విషయంలో అండర్ గ్రౌండ్, ఓపెన్ డ్రెయినేజీ విధానం సరికాదన్నారు. సింగిల్ ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమలు చేసేలా ప్రజలు, వ్యాపారులకు అవగాహన పెంచాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, రహదారుల పరిస్థితి మెరుగుపడాలన్నారు.

'నక్ష'ను మరింత ముందుకు తీసుకెళ్లండి

నక్ష కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేసి దీనిని మరింత ముందుకు తీసుకెళ్లేలాలని డిఎంఎ సంపత్‌కుమార్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం కౌన్సిల్ హాల్లో కమిషనర్ బాలస్వామితో కలిసి సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంఎ మాట్లాడుతూ నక్ష కార్యక్రమాన్ని 45 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉందన్నారు. కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ పనితీరుపై డిఎంఎ సంపత్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. నగరంలో జరుగుతున్న నిర్మాణాల వివరాలను టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష, టిపిఎస్ మంజులను అడిగారు. నగరంలో జరుగుతున్న నిర్మాణాలకు అధికారుల వద్ద ఉన్న వివరాలకు పొంతన లేదన్నారు.

కంపోస్టు యార్డు పరిశీలన

నగరంలో మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్ విస్తతంగా పర్యటించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగుల తయారీ వక్క, అరటి, ప్లేట్లను పరిశీలించారు. కంపోస్ట్ యార్డులో కుక్కల నియంత్రణ నిర్వహిస్తున్న ఆపరేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన డీఎంఏకు కమిషనర్ బాలస్వామి లేపాక్షి నంది ప్రతిపను అందజేశారు.

మరిన్ని ఆర్టీసీ బస్సుల కొనుగోలు

◆ పూర్తి స్థాయిలో మహిళలకు స్త్రీ శక్తి లబ్ధి ◆ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్, రాయదుర్గం, మడకశిర టౌన్

రాయదుర్గంలో మీడియాతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి (మహిళల ఉచిత బస్సు ప్రయాణం) పథకంకు అవసరమయ్యే బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆర్టీసీ ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలియజేశారు. ఇప్పటికే 1050 కొత్త బస్సులు మంజూరు కాగా మరో 1000 బస్సులు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలియజేశారు. మంగళవారం ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడికశిర ఆర్టీసీ డిపోలను తనిఖీ చేశారు. స్త్రీ శక్తి పథకంపై మహిళలు, ఆర్టీసీ సిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీపై ఏడాదికి రూ.2వేల కోట్లు భారం పడుతోందన్నారు. అయినా దీనిని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 74శాతం బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని, మిగిలిన 26శాతం బస్సుల గురించి ఆలోచించడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో 11వేలకు పైగానే బస్సులుండగా ఇందులో 8558 బస్సులలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ఎలక్ట్రికల్ బస్సులు అందులో ఏసీ సౌకర్యం ఉన్న బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. అంతరాష్ట్ర సర్వీసుల విషయంలో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. మహిళా ప్రయాణికులతో ఎలా మెలగాలన్న విషయంపై తమ సంస్థ ఉద్యోగులు, సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చామన్నారు. స్త్రీ శక్తి పథకం అమలు ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, నిర్వహణ భారం మాత్రమే తమ సంస్థ చూసుకుంటుందన్నారు. త్వరలోనే మహిళా ప్రయాణికుల సౌకర్యార్థం ఆధార్‌తో అనుసంధానం చేసిన స్మార్ట్ కార్డులను జారీ చేస్తామన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ రాయలసీమ జోనల్ చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది మహిళలు, బాలికలు శ్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. రాయలసీమ జోనల్ పరిధిలో 1054 బస్సులు ఉండగా వీటిలో 160 బస్సులు అంతరాష్ట్ర సర్వీసులు ఉన్నట్లు చెప్పారు. వీటిలో మహిళ, బాలికలు ప్రయాణికులను శ్రీ శక్తి పథకం కింద అనుమతించాలని కోరారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన రాయదుర్గం బస్టాండ్ భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉందని కొత్త భవనాన్ని నిర్మించాలని పూల నాగరాజు ఆర్టీసీ ఎండిని కోరారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజినీరింగ్) టి.చెంగల్ రెడ్డి, జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి.చంద్రశేఖర్ రెడ్డి, అనంతపురం జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ శ్రీలక్ష్మి, సత్యసాయి జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ మధుసూదన్, రాయదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్రీనివాస రావు, కళ్యాణదుర్గం డిఎం రామచంద్ర పాల్గొన్నారు.

గుంతల రోడ్లను బాగు చేయండి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్
కొనసాగిన సిపిఎం దీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

నగరంలోని గుంతలరోడ్లకు మరమ్మతులు చేయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. నగరంలోని తపోవనం నుంచి వెళ్లే రోడ్డును బాగు చేయాలని, రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద దగ్గర బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండోరోజు చేరుకున్నాయి. దీక్షలకు మద్దతు తెలిపిన గేయానంద్ మాట్లాడుతూ నగరంలో ప్రధానంగా ఉన్న రోడ్లను బాగు చేయాలని, రిషిత పబ్లిక్ స్కూల్ దగ్గర బ్రిడ్జి నిర్మించాలని, నడిమివంక సైడ్ వాల్ నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతలు ఏర్పడ్డాయన్నారు. నగర ప్రజలపై విపరీతమైన పన్నులను వసూలు చేయడం తప్ప మౌలిక వసతులను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మున్సిపాలిటీ బడ్జెట్‌లో ఒక్క శాతం ఖర్చు బ్రిడ్జి కోసం కేటాయిస్తే నిర్మించవచ్చన్నారు. సిటిజెన్ ఫోరం నాయకులు రాజమోహన్ మాట్లాడుతూ నడిమివంక సైడ్ వాల్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో గతంలో వరదలు వచ్చి అనంతపురంలో నివసిస్తున్న ప్రజలు ఎంత ఇబ్బందులు పడ్డారో పాలకులు తెలియదా.. అని ప్రశ్నించారు. కాగా నిరాహార దీక్షల సమయంలోనే తపోవనం నుంచి శాంతినగర్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు మురికినీటిలో పడ్డాడు. గమనించిన సిపిఎం నాయకులు, కార్యకర్తలు రక్షించారు. దంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీక్షలకు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలు, ఆవాజ్ కార్యదర్శి వలి, మెడికల్ రెప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త తిరుపాలు, సీనియర్ పాత్రికేయులు రమేష్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నగర నాయకులు ప్రకాష్, వెంకట్‌నారాయణ, ఇర్ఫాన్, రాజు, శీన, లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసమ్మ, శంకర, హాజీవలి, రమణ, అలీ, ఇస్రాయిల్, రియాజ్, సిపిఎం కాలనీ వెంకటేష్, మనీ, ప్రసాద్, రామాంజి, రాముడు, ముసలప్ప, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి పైప్‌లైన్ లీకేజీ

కళ్యాణదుర్గం టౌన్ : మండలంలోని పాపంపల్లి గ్రామం వద్ద మంగళవారం శ్రీరామిరెడ్డి తాగునీటి పైప్‌లైన్ లీకేజీ ఏర్పడింది. శ్రీరామిరెడ్డి ఫేస్-4 పైప్‌లైన్ పగిలిపోవడంతో భారీ స్థాయిలో నీరు ఎగిసి పడి వృథాగా పోయింది. పంట పొలాలు నష్టపోవడమే కాకుండా తాగునీటి సమస్య కూడా ఏర్పడుతుందని, వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎగిసిపడుతున్న నీరు

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-కణేకల్లు

ట్రాక్టర్‌పై ర్యాలీగా వస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ చేయడాన్ని హర్షిస్తూ మంగళవారం స్థానిక సాయిబాబా ఆలయం నుంచి బస్టాండ్ వరకూ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే ఐదింటిని పూర్తి చేశామన్నారు. 18ఏళ్ల పైబడిన మహిళలకు నెలకు రూ.1500 ఇచ్చే కార్యక్రమం కూడా త్వరలోనే చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగార్జున, జిన్నా బాబు, నాగేంద్ర, ముజాం, మిల్ మారుతి, చంద్రశేఖర్‌గుప్తా, ఆనంద్ రాజ్, రమేష్, బసవరాజ్, సుదర్శన్, వన్నారెడ్డి, నవీన్, చాందు, శరవన్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పింఛన్లను కొనసాగించండి మహాప్రభో..

ఎంపిడిఒ కార్యాలయాల వద్ద వికలాంగుల వేడుకోలు

రాప్తాడు మండలం చెర్లోపల్లిలో బాధితులతో మాట్లాడుతున్న రంగయ్య

'సార్.. మాకు అన్ని అర్హతలు ఉన్నాయి.. అయినా పింఛన్ రద్దు చేశారు.. మాకు న్యాయం చేయండి..' అంటూ జిల్లావ్యాప్తంగా వికలాంగులు వేడుకుంటున్నారు. పింఛన్లను తొలగించేందుకు వికలాంగులకు నోటీసులు జారీ చేయడంతో ఆందోళనకు గురవుతున్నారు. దీంతో ఆయా మండలాల పరిధిలోని ఎంపిడిఒ కార్యాలయాలకు క్యూలు కడుతున్నారు. వికలత్వంతో వచ్చేందుకు చేతకాకపోయినా అతికష్టం మీద కార్యాలయాల వద్దకు వచ్చి వేడుకుంటున్నారు.

ప్రజాశక్తి-రాప్తాడు

మంచానికే పరిమితమైన వారి పెన్షన్లు తొలగించడం అన్యాయం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో మంచానికి పరిమితమైన హర్షిత, శాంతమ్మతోపాటు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ హర్షిత పుట్టుకతోనే వికలాంగురాలు అన్నారు. చేతులు, కాళ్లు పని చేయకపోవడంతోపాటు మాటలు కూడా రావన్నారు. అలాంటి హర్షితకు వందశాతంఉన్న వికలాంగత్వాన్ని 50 శాతానికి తగ్గించి వస్తున్న రూ.15వేల పింఛన్‌ను రూ.6వేలకు తగ్గించారన్నారు. ఇదే గ్రామానికి చెందిన గోగుల శాంతమ్మ వెన్నెముకు దెబ్బతిని మంచానికి పరిమితమైంది. దీంతో వందశాతం వికలాంగుల సర్టిఫికెట్ ఇచ్చి ఇప్పుడు 50 శాతానికి తగ్గించి రూ.15 వేల నుంచి రూ.6వేలకు పెన్షన్‌ను తగ్గించారనాన్రు. కావున ప్రభుత్వం వెంటనే హర్షిత, శాంతమ్మతోపాటు అలాంటి వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామాంజనేయులు, చంద్రమోహన్, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : 'సార్.. మాకు అన్ని అర్హతలు ఉన్నాయి.. అయినా పింఛన్ రద్దు చేశారు.. మాకు న్యాయం చేయండి..' అంటూ మండలంలోని పలువురు వికలాంగులు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చి వేడుకున్నారు. ఈమేరకు కార్యాలయంలో ఎంపిడిఒ మమతాదేవిని కలిసి విన్నవించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలానికి చెందిన రుబినా, సుజాతకు 90 శాతం వికలాంగత్వ సర్టిఫికెట్ ఉందని, అయినా పింఛన్ తొలగించారని వాపోయారు. అదేవిధంగా వెంకటాంపల్లి గ్రామానికి చెందిన కేశన్న పక్షపాతం సోకడంతో పింఛన్ వస్తోంది. ప్రస్తుతం ఆయన పింఛన్ కూడా తొలగించారు. వీరితోపాటు సుమారు 50 మంది తమకు అన్ని అర్హతలు ఉన్నా పింఛన్లు తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ఎంపిడిఒ స్పందిస్తూ వికలాంగులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.

కళ్యాణదుర్గం రూరల్ : నోటీసులు వచ్చిన వికలాంగులు ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ సూర్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంబదూరు మండల వ్యాప్తంగా ఇంతవరకు వివిధ రకాల పింఛన్లు పొంది వివిధ కారణాలతో రద్దు అయినట్లు నోటీసులు జారీ చేశారన్నారు. వారితో ఎవరైనా అర్హులు ఉంటే తలమ ఆధార్‌కార్డు ,పెన్షన్ రద్దయిన నోటీసు, పాత, కొత్త సదరం సర్టిఫికెట్ జత పరిచి సమర్పించాలని కోరారు.

బుక్కరాయసముద్రం : పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ స్థానిక జనచైతన్య నగర్ కాలనీకి చెందిన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారులతో కలిసి టిడిపి నాయకులు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎంపిడిఒ సొలమన్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు బాబా ఫక్రుద్దీన్ వలి మాట్లాడుతూ కాలనీకి చెందిన చాలామంది వికలాంగులు మంచానికే పరిమితం అయ్యారన్నారు. అలాంటి వారికి కూడా పింఛన్లు తొలగించారన్నారు. ముఖ్యంగా 23ఏళ్ల బుద్ధిమాంద్య దూదేకుల గఫూర్, మానసిక వికలాంగుడు షామీర్, 50ఏళ్ల కమీషన్ వంటి వారితో కొందరికి పింఛన్ల తొలగింపు, మరికొందరికి పెన్షన్ మార్పు చేశారన్నారు. కావున వెంటనే వారందరికీ గతంలో వచ్చే పింఛన్లనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూల శంషాద్, అంచల మునీర, అస్మత్, దూదేకుల హసీన, నిర్మల, దూదేకుల మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆటో వద్దకే వచ్చి వికలాంగులతో మాట్లాడుతున్న నార్పల ఎంపిడిఒ మమతాదేవి

పుట్లూరు : తొలగించిన పింఛన్లను తిరిగి పునరుద్ధరించాలని మండలంలోని పలువురు వికలాంగులు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు చాలామంది వికలాంగులు ఎంపిడిఒ అలివేలమ్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఎవరైనా అర్హులుగా ఉండి అనర్హులుగా నోటీసు అందజేసి ఉంటే వారు ఎంపిడిఒ కార్యాలయంలో సంప్రదించి అర్జీ పెట్టుకోవాలన్నారు.

జెఎన్‌టియు పరీక్ష ఫలితాలు విడుదల

ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బి.ఫార్మసీ 4వ సంవత్సరం 2వ సెమిస్టర్ అడ్వాన్స్‌డ్, ఫార్మా-డి 3వ సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ, బిబిఎ 1వ సంవత్సరం 2వ సెమిస్టర్ రెగ్యులర్, బిబిఎ 1వ సంవత్సరం 1వ సెమిస్టర్ సప్లిమెంటరీ, ఎంఎస్ 4వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎపి శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ జి.శంకర్ శేఖర్‌రాజు, శ్రీధర్, ఎం.అంకారావు ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntuaresults.in ను సంప్రదించాలని కోరారు.

వర్షాలకు అప్రమత్తత అవసరం

పుట్లూరు : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరించి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు, ఇతర పరికరాలకు దూరంగా ఉండాలని విద్యుత్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తడి చేతులతో ఎలక్ట్రిక్ స్విచ్ ఆన్, ఆఫ్ చేయకూడదన్నారు. ఇళ్లు, తడి నేలపై ఎలక్ట్రిక్ తీగలు, పరికరాలు పడిపోకుండా జాగ్రత్త పడాలన్నారు. వర్షాకాలంలో ఇంటి వద్ద ఇనుప కమ్మీలు, సిమెంట్ రాడ్లు, బరువు రేకులు పడవేయకూడదన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగి ఉంటే స్థానిక విద్యుత్ అధికారులకు గానీ, 1912కుగానీ సమాచారం ఇవ్వాలన్నారు.

21న వికలాంగుల ఛలో కలెక్టరేట్

కళ్యాణదుర్గం రూరల్ : అర్హులైన వికలాంగులు అందరికీ పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు హెచ్ వసంత్‌కుమార్ మంగళవారం తెలిపారు. దివ్యాంగులు ఎవరూ అధైర్య పడొద్దని, సమిష్టిగా పోరాడి మనహక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు.

స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

విద్యుత్ ఛార్జీల పేరుతో చేస్తున్న నిలువుదోపిడీకి అడ్డుకట్ట వేయడంతోపాటు ప్రమాదకరంగా మారుతున్న స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం కూడేరు మండలంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి, బిజెపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్‌మీటర్లు బిగించడానికి వస్తే పగలగొట్టండని పిలుపునిచ్చిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్‌బాబు అదే స్మార్ట్‌మీటర్లను కొనసాగించడం బాధాకరమన్నారు. సంస్కరణల్లో భాగంగా ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూడేరు మండలంలోని పలు గ్రామాల్లో రూ.1,850 చెల్లించి స్మార్ట్ మీటర్లు బిగించుకోవాలని బలవంతంగా విద్యుత్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.కరీంసాబ్, మండల కమిటీ సభ్యులు మల్లికార్జున, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

డిఎంఎకు సిఐటియు వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

అనంతపురం మున్సి పల్ కార్పొరేషన్‌కు విచ్చేసిన మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్‌ను సిఐటియు నాయకులు కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, నగర కార్యదర్శి సాకే తిరుమలేష్ మాట్లాడుతూ అనంతపురం నగరపాలక సంస్థలో 10 మంది కార్మికులు అనారోగ్యంతో చనిపోయి మూడున్నర సంవత్సరం కావస్తున్నా నేటికీ వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వలేదన్నారు. పెరిగిన నగర జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి పనిభారం కోరారు. మృతి చెందిన కార్మికుల కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందే అన్ని సాయాలను వెంటనే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సభ్యులు లక్ష్మీనరసమ్మ, బండారి ఎర్రిస్వామి, శశింద్ర కుమార్, మరియమ్మ, నల్లప్ప పాల్గొన్నారు.

బిల్లుల కోసం కాంట్రాక్టర్ల వినతి

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో చేసిన పనులకు చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని గుత్తేదారులు డిఎంఎ సంపత్ కుమార్ కోరారు. కాంట్రాక్టర్లు రత్నయ్య, వేణుగోపాల్ రెడ్డి, నులక వెంకటేశు, ఇస్మాయిల్, సుధాకర్, తరుణ్, షఫీలు డిఎంను కలిసి వారి సమస్యలను వివరించారు. 17 నెలలుగా సిఎఫ్ఎంఎస్ పోర్టల్ ద్వారా వర్క్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నిధి పోర్టల్ జనరల్ ఫండ్స్ పిఎఒ ద్వారా కాకుండా మున్సిపల్ ఆడిట్ ద్వారా సమర్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై డిఎంఎ స్పందిస్తూ బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆదేశించారు.

సీనియార్టీ జాబితా ప్రకటించి అర్హులైన వార్డు సెక్రటరీలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని సచివాలయ జేఏసీ నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ వరప్రసాద్ రామకృష్ణ తదితరులు వినతిని అందజేశారు. ఉద్యోగులు చేరిన తేదీ నుంచి నోషనల్ ఇంక్రిమెంట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

బ్లాక్ ప్లాంటేషన్ పనుల పరిశీలన

ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న పీడీ సలీంబాషా

కళ్యాణదుర్గం రూరల్ : ఉపాధి హామీ పథకంలో భాగంగా కంబదూరు మండలంలోని మార్రిమాకులపల్లి, ఒబగానపల్లి గ్రామాల్లో చేపట్టిన బ్లాక్ ప్లాంటేషన్ పనులను డ్వామా పీడీ సలీంబాషా మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా పలువురు శ్రామికులు కూలి డబ్బులు, హార్టికల్చర్ బిల్లులు సకాలంలో పడేలా చూడాలని పీడీ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన పీడీ సమస్యలను కలెక్టర్, రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపిడిఒ సూర్యనారాయణ, ఎపిఒ శ్రీదేవి, ఇసి ఉస్మాన్, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, రైతులు, శ్రామికులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

గుత్తి : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని తహశీల్దార్ జి.పుణ్యవతి పిలుపునిచ్చారు. మెగాస్టార్ చిరంజీవి 70 జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గుత్తిలో మంగళవారం అభిమాన సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు పాటిల్ సురేష్, రామ్‌చరణ్ యువశక్తి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య, నాయకులు భాష కార్తీక్, రంగా, బాలు, మురళి, సందీప్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

తరిమెలలో దారులు బురదమయం

బురద రోడ్డులో సిపిఎం నాయకులు భాస్కర్

శింగనమల : వరుసగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని తరిమెల గ్రామంలోని రోడ్లు బురదమయంగా మారాయని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ అన్నారు. ఈమేరకు మంగళవారం బురద రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి చినుకులు పడినా తరిమెలలో రోడ్లు బురదమయంగా మారుతున్నాయన్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు బురదలో కింద పడుతున్నారన్నారు. ఈ విషయం గ్రామ సచివాల సిబ్బందితోపాటు పంచాయతీ సెక్రటరీకి తెలిసినా చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బురదమయమైన రోడ్లను బాగు చేయాలని కోరారు.

నీట మునిగిన పంటల పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో నీట మునిగిన పంట పొలాలను రైతుసంఘం, కౌలు రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, కౌలు రైతుసంఘం ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్,వెంకటేశులు మాట్లాడుతూ 15 రోజుల నుంచి కురిసిన వర్షాల కారణంగా ఉరవకొండ మండలంలోని అనేక ప్రాంతాల్లో పంటలు నీటి మునిగాయన్నారు. ముఖ్యంగా ఉరవకొండ నుంచి గడేహోతూరుకు వెళ్తే రోడ్డు పక్కన సాగు చేసిన కంది పంట నీట మునిగి కుళ్లిపోయిందన్నారు. వేరుశెనగ, ఇతర పంటల పరిస్థితి కూడా అందేనన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పంట పొలాలను పరిశీలించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం మండల నాయకులు సుంకన్న, వన్నూరుస్వామి, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

అర్థం చేసుకుంటే గణిత-శాస్త్రం సులభం

ప్రొఫెసర్ లెనిన్‌బాబు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గణిత శాస్త్రంపై బోధిస్తున్న ప్రొఫెసర్ ఎస్.లెనిన్‌బాబు

గణితశాస్త్రాన్ని అర్థం చేసుకుంటే పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తారని ప్రొఫెసర్ లెనిన్‌బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ సూచించారు. మంగళవారం అనంతపురంలోని కెఎస్ఆర్ బాలికల పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు గణిత పాఠ్యాంశాలు సులభంగా ఎలా అర్థం చేసుకోవాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులకు గణితశాస్త్రం ఓ పెద్ద అగాధంగా మారిందన్నారు. అయితే గణితాన్ని అర్థం చేసుకుంటే చాలా సులభంగా ఉంటన్నారు. గణితశాస్త్రంలో నాలుగు పాఠ్యాంశాలు అవగాహన చేసుకుంటే మొత్తం గణిత శాస్త్రాన్ని అవపోసన పట్టవచ్చున్నారు. ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, బొడ్మాస్ రూల్ లాంటివి తెలుసుకుంటే పెద్దపెద్ద లెక్కల సమస్యలను సులభంగా ఛేదించవచ్చు. ఇంటర్, యూజీ, పీజీల్లో కూడా ఈ అంశాల బేస్ చేసుకుంటే అతి సులభం అవుతుందన్నారు. కావున విద్యార్థులు గణిత శాస్త్రాన్ని ఇష్టంతో చదవాలన్నారు. ముఖ్యంగా 9, 10వ తరగతి పిల్లల్లో పబ్లిక్ పరీక్షలకు భయం లేకుండా ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి, జిల్లా నాయకులు విజయ్, ఉపాధ్యాయులు నాగరాజు, పద్మజ, కవిత, అమరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 1016 మెట్రిక్ టన్నుల ఎరువులు రాక

అనంతపురం : జిల్లాకు ప్యాక్ట్ కంపెనీకి చెందిన 20:20:0:13 ఎరువులు 1016 మెట్రిక్ టన్నులు మంగళవారం వచ్చినట్లు ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఇందులో ప్రయివేటు డీలర్లకు 826 మెట్రిక్ టన్నులు, కంపెనీ గోదాములో 190 మెట్రిక్ టన్నులు నిల్వ ఉంచినట్లు తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అనంతపురం : జిల్లా వ్యవసాయ కార్యాలయంలో జిల్లా ఎరువుల సమస్యలు, వర్షాల వల్ల జరిగిన నష్టం నివేదికలు ఎప్పటికప్పుడు తెప్పించుకోనేందుకు జిల్లా వ్యవసాయఅధికారిణి యు.ఉమా మహేశ్వ రమ్మ నలుగురు సీనియర్ అసిస్టెంట్స్‌తో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశారు. వీరు మండల వ్యవసాయ అధికారులు, డివిజన్ అధికారులతో మాట్లాడి నివేదికలు తీసుకోనున్నారు.

క్రీడల్లో మాంటిస్సోరి విద్యార్థుల హవా

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

రాప్తాడు : క్లస్టర్-7 సిబిఎస్-ఇ ఆటల పోటీల్లో మండలంలోని గొల్లపల్లి గ్రామం వద్ద ఉన్న మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు హవా కొనసాగించారు. ఆగస్టు 9, 10, 11వతేదీల్లో రాజమండ్రి, తునిలోని ప్రకాష్ విద్యానికేతన్ స్కూల్‌లో జరిగిన క్లస్టర్ - 7 సిబిఎస్ఇ ఖోఖో పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో ఇంటర్ స్టేట్ లెవెల్‌లో మాటిస్సోరి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులతోపాటు కోచ్‌లు టిప్పు సుల్తాన్, వీరన్నను కరస్పాండెంట్ సమీరా, ఎండి కృష్ణభరత్, ప్రిన్సిపాల్ ప్రతాపరెడ్డి, తదితరులు అభినందించారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం

రికార్డులను పరిశీలిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ షారోన్ సోనియా

మెడికల్ కళాశాలలో అన్నిశాఖల అధికారులు, సిబ్బంది విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా హెచ్చరించారు. మంగళవారం స్థానిక మెడికల్ కళాశాలలోని పెథాలజీ, మైక్రో బయాలజీ, ఫార్మకాలజి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా డాక్టర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్ హాజరు పట్టికలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అందరూ విధులకు హాజరయ్యారా లేదా, సెలవు చీటీలు పెడుతున్నారా.. పని మీద బయటకు వెళ్తున్నప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారా.. లేదా.. అని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ బాధ్యతాయుతంగా ప్రభుత్వ ఉద్యోగాన్ని నిర్వహించాలని కష్టపడి పనిచేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మంచి పేరు తీసుకువచ్చేలా ప్రజల మన్ననలను పొందేలా ఉద్యోగం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తెలుగు మధుసూదన్, మెడికల్ కళాశాల నేషనల్ మెడికల్ కమిషన్ కోఆర్డినేటర్ వాల్మీకి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

శింగనమల : మండలంలోని బండమీదపల్లి సమీపంలో ఉన్న స్వర్ణభూమి ఫర్టిలైజర్స్, లోలూరు క్రాస్‌లోని భాస్కర్ ఫర్టిలైజర్స్ ఎరువుల కర్మాగారాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా యూరియా నిల్వల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్, ఎఒ అన్వేష్‌కుమార్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

ఆలయ వివాదాస్పద స్థలం పరిశీలన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మండల కేంద్రంలోని అత్యంత వివాదాస్పదమైన ముసలమ్మ ఆలయ స్థలాన్ని తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, సర్వేయర్ ప్రతాపరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆలయానికి సంబంధించిన 20 సెంట్ల స్థలం అనంతపురానికి చెందిన ఓ వ్యక్తి పేరుపై ఆన్‌లైన్ ఎక్కించడంతో వివాదం చెలరేగింది. 25 సెంట్లు విస్తీర్ణంలో సగం స్థలం అనంతపురం-తాడిపత్రి 4వ వరుసల రహదారి విస్తరణలో పోయింది. మిగిలిన స్థలం మాత్రమే ఇక్కడ ఉన్నట్లు గుర్తించారు. ఈ స్థలం కూడా ముసలమ్మ ఆలయం ఆలయ పరిధిలోనే ఉన్నట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు సుశీలమ్మ, సూర్యనారాయణరెడ్డి, గ్రామస్తులు రవీంద్ర మల్లికార్జున, రామకృష్ణ, నారాయణస్వామి, తదితరులు మాట్లాడుతూ 400 ఏళ్ల నుంచి ఈ స్థలం అమ్మవారి ఆలయం అధీనంలోనే ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో స్థలాన్ని అక్రమార్కులకు కట్టబెట్టవద్దని రెవెన్యూ అధికారులను కోరారు. దేవుడి స్థలాన్ని కొట్టేస్తే పుట్టగతులు ఉండవన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి మాట్లాడుతూ భక్తుల మనోభావాలను గౌరవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ముసలమ్మ భక్తులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
M.V.O.P No.212/2022
షేక్.అతావుల్లా షరీఫ్. ...అర్జీదారు
-Vs-
కె.దామోదర్ ఆచారి వగైరా. ...రెస్పాండెంట్లు
3వ రెస్పాండెంటుకు నోటీసులు
3).చిందుల శివకుమార్ తండ్రి సి.వెంకటేశ్వర్లు, డ్రైవరు.ప్రస్తుత నివాసం.ఇంటి.నెం.సి/631, బి.సి.హస్టల్ వెనుక,బొమ్మనహాల్ గ్రామము, మరియు మండలం, అనంతపురం జిల్లా.
పై నంబరు M.V.O.P లో అర్జీదారు 20-12-2018 వతేదిన రోడ్డు ప్రమాదంలో జరిగిన గాయములకు నష్టపరిహారం రూ.2,00,000/-లు, ప్రమాదం జరిగిన రోజు నుండి 12% ప్రకారం వడ్డీ మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ అర్జీదారు అర్జీదాఖలు చేసినారు. ఇందులో 3వ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 01-9-2025 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానింప బడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది : 01-9-2025
యం. మురళీమోహన్‌రెడ్డి,
యం. పుష్పలలితమ్మ,
అర్జీదారు పరం అడ్వకేట్లు
కర్నూలు.

మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రతాప్‌కు సన్మానం

మార్కెట్ యార్డు ఛైర్మన్ సూర్యప్రతాప్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న గుర్రాల సూర్యప్రతాప్‌ను మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో టిడిపి నాయకులు, కార్యకర్తలు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అలాగే ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు బి.రమేష్ వివాహ వార్షికోత్సవ పురస్కరించుకుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎంకె.చౌదరి, బి.మారుతీప్రసాద్, వైస్‌ఛైర్మన్ మాలిక్‌బాషా, సర్పంచి యు.రామలింగయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు జి.చికెన్ శీనాయాదవ్, నాయకులు ఆర్.సొలమన్‌రాజా, కోనంకి కృష్ణ, న్యాయవాది సోము, చెట్నేపల్లి రమేష్, బసినేపల్లి రామాంజి, డేగ మద్దిలేటి, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

పంటలపై రైతులకు అవగాహన

యాడికి : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో పంటలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుత్తి వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరాముడు, అనంతపురం రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి నరసింహులు సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రజిత, గ్రామ వ్యవసాయ అధికారి రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నార్పల : మండలంలోని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్‌టిఐ రామాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు తరిమెల గిరి, సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాష్ మాట్లాడుతూ మండలంలోని దుగుమర్రి, తుంపెర, గొల్లపల్లి, సిద్ధరాచెర్ల, పప్పూరు, గడ్డంనాగేపల్లి, చామలూరు తదితర గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు ఉన్నా బస్సులు నడపడం లేదన్నారు. ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రజలతోపాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారన్నారు. కావున వెంటనే ఆయా గ్రామాలకు బస్సులు నడపాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డుపై తెగిపడిన విద్యుత్ వైరు

కళ్యాణదుర్గం టౌన్ : కళ్యాణదుర్గం-కన్నేపల్లి ప్రధాన రహదారిలో పట్టణ సమీపంలో విద్యుత్ వైరు తెగిపడి రోడ్డుపై పడటంతో మంగళవారం ఉదయం రాకపోకలు స్తంభించాయి. 11 కెవి విద్యుత్ వైర్ తెగి రోడ్డుపై పడటంతో రహదారిలో వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సమాచారాన్ని విద్యుత్ అధికారులకు తెలియజేయడంతో వెంటనే స్పందించారు. ఉదయం 8 గంటల సమయంలో విద్యుత్ వైరు తెగపడగా 40 నిమిషాల్లో సమస్యను పరిష్కరించారు. దీంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ఉప్పరాల గ్రామంలో బోయ సురేష్‌కు చెందిన నాలుగు గొర్రెలు విద్యుత్ ప్రమాదంలో మృత్యువాత పడ్డాయి. బాధిత కాపరి తెలిపిన వివరాల మేరకు.. రోజుమాదిరే ఉప్పరాల గ్రామంలో గౌడమల్ల పొలం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తుండగా ఉన్నట్టుండి నాలుగు గొర్రెలు కింద పడ్డాయి. దీంతో మిగతా గొర్రెలు పరుగులు తీశాయి. అప్రమత్తమైన సురేష్ కర్రతో గొర్రెలను కదిలించాడు. విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయని తెలుసుకుని విద్యుత్ అధికారులకు సమాచారం అందించాడు. వారు వచ్చి పరిశీలించారు.

నీటి శుద్ధి ప్లాంట్ వితరణ

నార్పల : మండల పరిధిలోని దుర్గం గ్రామంలో సర్పంచ్ సాకే రామాంజనేయులు తన సోదరి సాకే మాధవీదేవి జ్ఞాపకార్థం నీటి శుద్ధి ప్లాంట్‌ను వితరణ చేశారు. ఈ ప్లాంట్‌ను మండల విద్యాధికారులు కిష్టయ్య, నారపరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, సంజీవరాయుడు, ఇందిర, గ్రామస్తులు రామ్మోహన్‌రెడ్డి, రామాంజనేయులు, కిరణ్‌కుమార్, రోగి మారన్న, రాము, పెద్దక్క, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

యాడికి : మండలంలోని పలు ఎరువుల దుకాణాలను గుత్తి డివిజన్ సహాయ సంచాలకులు వెంకట రాముడు, యాడికి తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులోఉ భాగంగా వెంకట్ ఫర్టిలైజర్స్ దుకాణంలో అనుమతులు లేని ఏషియన్ బయోటెక్ కంపెనీ నవారా ఎరువును సీజ్ చేశారు. అలాగే యూరియా అధిక ధరకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రాయలచెరువులో న్యూ లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, లక్ష్మీవెంకటేశ్వర ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ గార్లదిన్నె మండల కార్యవర్గం ఎన్నిక

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) గార్లదిన్నె మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సి రాజుద్దీన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. ఎపిటిఎఫ్ గార్లదిన్నె మండల గౌరవాధ్యక్షులుగా ప్రసాద్, గౌరవ సలహాదారులుగా సి.నాగరాజు, మండల అధ్యక్షులుగా బి.పర్వతయ్య, ప్రధాన కార్యదర్శిగా మహేష్, జిల్లా కౌన్సిలర్లుగా రంగనాయకులు, కోటి, వన్నప్ప, గ్రేస్ విమలమ్మ, అనిల్‌కుమార్, నారాయణస్వామి, మండల ట్రెజరర్ బి.బలరాముడు ఎన్నికయ్యారు.

అమరావతిపై విషం చిమ్మడం ఆపాలి

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధిపై విషం చిమ్మడం వైసిపి అధినేత జగన్ ఇప్పటికైనా మానుకోవాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జిరాయితీ గౌస్‌మోదీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉన్నప్పుడు రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకుని రైతులను దగా చేసి.. మొసలి కన్నీరు కార్చడం బాధాకరమన్నారు. అమరావతి ముంపు ప్రాంతాల్లో ఉందని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జగన్‌తోపాటు ఆ పార్టీ నాయకులు విషం చిమ్మడం మానుకోవాలని హితవు పలికారు.

చైన్ స్నాచర్ల అరెస్టు

అనంతపురం క్రైం : ఇద్దరు చైన్ స్నాచర్లను అరెస్టు చేసి బంగారు చైన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కంబం నాగార్జున అలియాస్ నాగార్జునరెడ్డి, బోజనోల వరప్రసాద్ అలియాస్ ప్రసాద్ అరెస్టు చేసి 23 గ్రాముల బరువు కలిగిన బంగారు చైను, 1.5 గ్రాము బరువు కలిగిన ఒక బంగారు తాళిబొట్టు, బంగారు లక్ష్మి కాసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

21న ఎన్జీవో భవనం ప్రారంభం

కళ్యాణదుర్గం టౌన్: కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసిన ఎపి ఎన్‌జిఒ నూతన భవనాన్ని ఈనెల 21వతేదీన ప్రారంభించనున్నట్లు ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్ తెలిపారు. మంగళవారం నూతన ఎన్‌జీఓ భవనంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఎన్‌జీఓ సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ భవనాన్ని ఎమ్మెల్యే సురేంద్రబాబు ప్రారంభించన్నుట్లు తెలిపారు. ప్రారంభోత్సవానికి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు, ఎపి జెఎసి చైర్మన్ ఆలపర్తి విద్యాశాఖ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, కళ్యాణదుర్గం, రాయదుర్గం అధ్యక్షులు చెన్నారెడ్డి, లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు కిషోర్, జాన్సన్, వెంకటేష్‌బాబు, సోమశేఖర్, ఫజుల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోసగించడమే చంద్రబాబు నైజం

వైసిపి సమన్వయకర్త, మాజీ ఎంపి రంగయ్య

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మోసగించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని వైసిపి సమన్వయకర్త, మాజీ ఎంపీ రంగయ్య విమర్శించారు. మంగళవారం మండల పరిధిలోని పొబ్బర్లపల్లి, పోలేపల్లి గ్రామాల్లో 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ క్యూఆర్‌కోడ్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. ఏడాది పాలనలో మాటలు, మోసాలే తప్ప ఒరగబెట్టిందేమీ లేదన్నారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలను అన్నివర్గాల వారినీ మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ మండలాల కన్వీనర్లు చంద్రశేఖర్, గొల్ల సూరి, హనుమంతురాయుడు, వైసిపి నాయకులు గంగాధరప్ప, గోపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అందజేస్తున్న వైసిపి నాయకులు

యల్లనూరు : మండలంలోని నీర్జాంపల్లి, వెంకటాంపల్లి, దంతలపల్లి గ్రామాల్లో వైసిపి నాయకులు మంగళవారం రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి మండల కన్వీనర్ శివశంకర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పెద్దిరెడ్డి, బాల వెంకటరెడ్డి, రాజారెడ్డి, విష్ణునారాయణ, కందిగోపుల సూరి, తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ ద్వారా అవగాహన కల్పిస్తున్న మాజీ ఎంపీ రంగయ్య

స్వచ్ఛరాయదుర్గానికి కృషి చేద్దాం

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

స్వచ్ఛమైన, పరిశుభ్రమైన రాయదుర్గంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్య కార్మికులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణ పారిశుధ్యంపై ఇటీవల పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మంగళవారం ఉదయం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పట్టణంలో పారిశుధ్యంపై పలు ఫిర్యాదు వస్తున్నాయని కార్మికుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా వీధుల్లో చెత్తచెదారం సరిగా తొలగించడంలేదని, మురికి కాలువలను శుభ్రం చేయడం లేదని వార్తలు వస్తున్నాయన్నారు. రాయదుర్గం ప్రజలు చాలా మంచివారని.. వారికి సేవ చేయడం మనం అదృష్టంగా భావించాలన్నారు. ప్రజలు తాగునీరు, పరిశుభ్రత, వీధిలైట్లు లాంటి కోరుకుంటారన్నారు. ఇందుకు కార్మికులు స్పందిస్తూ తగినంత మంది కార్మికులు లేని కారణంగా పనిభారం అధికం అవుతోందని విప్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పురపాలక శాఖా మంత్రికి చెప్పి మరి కొంతమందిని నియమించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్రయాదవ్, మున్సిపల్ వార్డు సభ్యురాలు ప్రశాంతి, మాజీ వైస్‌చైర్మన్ వెంకటేశులు, మాజీ వార్డు సభ్యులు హనుమంతు, భారతి, పురుషోత్తం, సచివాలయ ఉద్యోగులు, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

'నీవు చేసినవి గుర్తు లేవా'.?

తాడిపత్రి కౌన్సిలర్ మల్లికార్జున

ప్రజాశక్తి-తాడిపత్రి

అధికారంలో ఉన్నప్పుడు చేసినవి మర్చిపోయావా.. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి.. అని తాడిపత్రి కౌన్సిలర్ మల్లికార్జున అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు అడ్డుకోవడంతో పోలీసుల తీరును తప్పుబట్టిన మాజీ పెద్దారెడ్డి గతంలో ఆయన చేసిన పనులను గుర్తు చేసుకోవాలన్నారు. నీ హయాంలో ఐదేళ్లు పొట్టి రవిని ఊరిలోకి నానివ్వకుండా చేయాలని అప్పటి డీఎస్పీ చైతన్యకు ఫోన్ చేయలేదా.. అని గుర్తు చేశారు. గతంలో పని చేసిన పోలీసులే ఇప్పుడూ పని చేస్తున్నారని వారి విధులను శంకించిన పెద్దారెడ్డి.. ఆయన హయాంలో టిడిపి హయాంలో పని చేసిన పోలీసులు లేరా.. అని నిలదీశారు. అయితే గతంలో పని చేసిన ఎస్ఐ ధరణిబాబు నిష్పక్షపాతంగా వ్యవహరించాడు కాబట్టే ఇప్పుడూ కొనసాగుతున్నాడన్నారు. పెద్దారెడ్డికి పోలీసుల గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. నీలాగా జెసి ప్రభాకర్ రెడ్డి వ్యవహరించలేదన్నారు. నిజంగా ప్రభాకర్‌రెడ్డి రాజకీయం చేసి ఉంటే నువ్వు తిమ్మంపల్లిలో కూడా అడుగు పెట్టేవాడివి కాదన్నారు. అంతేగాకుండా జైలులో ఊసలు లెక్కపెట్టేవాడికి అన్నారు. నీకు దమ్ము, ధైర్యం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

పాఠశాలకు దాతల వితరణ

ప్రజాశక్తి-అనంతపురం

రుద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాతలు వివిధ వస్తువులను పాఠశాలకు వితరణ చేశారు. పతకమూరి కుమార్ నాయుడు, జూటూరు వెంకటేష్ కలిసి చెరో రూ.30వేలు వెచ్చించి డ్రమ్ములు, మైక్‌సెట్, లౌడ్ స్పీకర్లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.సుమంగళి ద్వారా అందించారు.

పాఠశాలకు వస్తువులు అందజేస్తున్న దాతలు

పార్టీ కోసం కష్టపడి పనిచేద్దాం

ప్రజాశక్తి-శింగనమల

నియోజకవర్గంలో కష్టపడి పని చేసి వైసిపి అధినేత జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆపార్టీ ఎన్ఆర్ఐ వింగ్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నజలాలపురం గ్రామానికి చెందిన నూతన వధూవరులను మంగళవారం ఆశీర్వది ంచారు. చిన్నజలాలపురానికి చెందిన వైసిపి నాయకులు ఎన్‌వి నారాయణ కుమారుడికి గత ఆదివారం వివాహమైంది. అయితే అప్పుడు సాంబశివారెడ్డి అందుబాటులో లేకపోవడంతో మంగళవారం గ్రామానికి చేరుకుని వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేద్దామన్నారు. 2029లో వైసిపి తప్పకుండా అధికారంలోకి వచ్చి జగన్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, నాయకులు బొమ్మన భాస్కర్‌రెడ్డి, శోదనపల్లి చెవిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వధూవరులతో ఆలూరు సాంబశివారెడ్డి

గ్రీన్ పవర్ యూనిట్ పరిశీలన

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి రూరల్ పరిధిలోని కడప రోడ్డులో గన్నెవారిపల్లె కాలనీలో ఉన్న గ్రీన్‌పవర్ మ్యానుఫ్యాక్చరింగ్, డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయెడ్ యూనిట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయా యూనిట్లలో సబ్సిడీ యూరియా ఏమైనా వినియోగిస్తున్నారా.. యూనిట్ నిర్వహణ వంటి విషయాలపై ఆరాతీశారు. సబ్సిడీకి సంబంధించి ఎలాంటి యూరియాను ఉపయోగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంకల అధికారి వెంకటేశ్వర్లు, తాడిపత్రి వ్యవసాయ ఉపసంచాలకులు రవి, ఆర్‌వి సీఐ శ్రీనివాసులు, ఇఒ వాసుప్రకాష్, మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ ఏర్పాటుకు నోటిఫికేషన్

గుత్తి : మున్సిపాలిటీలో బార్ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బార్ పరిమితి సెప్టెంబర్ 1 నుంచి 2028 అక్టోబర్ 31వతేదీ వరకూ గడువు ఉంటుందన్నారు. సంవత్సర కాలానికి రూ.35 లక్షలు లైసెన్స్ ఫీజు ఆరు విడుతలుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

యూనివర్సిటీల్లో ఖాళీలు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆర్ఇఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఆర్.నారాయణనాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను ఎపిపిఎస్‌సి ద్వారా ఇంటర్వ్యూలు లేకుండా భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఇఎఫ్ జాతీయ కన్వీనర్ జి.నాగభూషణం, రాష్ట్ర కోకన్వీనర్లు మావిటి శ్రీరాములు, బి.ఉమాశంకర్, ఎం.ఓబులేసు, బి.రాజశేఖర్, రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు టి.రాజారమేష్, రాయలసీమ కో కన్వీనర్లు టి.ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, యుగంధర్, ఎన్.రాఘవేంద్రరావు, ఆర్.మహేష్‌నాయక్, పవన్‌కుమార్, సాయినాథ్ యాదవ్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఆర్ఇఎఫ్ నాయకులు